క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


ప్రిన్సిపాల్ జింకా అశోక్ కుమార్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ నూతన ప్రిన్సిపాల్ గా జింకా అశోక్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు పదవీ విరమణ చెందారు. దీంతో ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్య డైరెక్టర్ గుమ్మల గణేష్ కుమార్ కళాశాలలో మెకానికల్ బ్రాంచ్ హెచ్‌ఓడీగా పనిచేస్తున్న జింకా అశోక్‌కుమార్‌ను నూతన ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపాల్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఓడీలు, బోధనేతర సిబ్బందికి ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ హర్షం


చాపాడులో సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చాపాడు : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు గురువారం ఇచ్చిన తీర్పు పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకూ చాపాడులోని నాలుగు రోడ్ల కూడలిలో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు.

30 సంవత్సరాల పోరాటం ఫలించింది


అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఖాజీపేట : మాదిగలకు న్యాయం కావాలని 30 సంవత్సరాలుగా చేసిన పోరాటానికి ఫలితం నేడు వచ్చిందని ఎమ్ఎస్పీ జిల్లా నాయకుడు జయరాముడు అన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ మండల నాయకులు పుల్లూరు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మరియన్న, చాట్ల విజయభాస్కర్, బాబు, వెంకటరమణ, శ్రీకాంత్, నరశింహులు పాల్గొన్నారు.

ఎన్నో ఏళ్ల మాదిగల కల ఫలించింది

ప్రొద్దుటూరు : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుతో ఎన్నో ఏళ్ల మాదిగల కల ఫలించిందని ఎంఎస్పీ ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి యాదికి రమేష్ మాదిగ తెలిపారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో గురువారం స్థానిక పాతబస్టాండ్‌లోని బీఆర్ అంబేడ్కర్ వద్ద విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబు, ఏపీజేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాల్మన్, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వం కులాల మధ్య చిచ్చు పెడుతోంది

రాజుపాళెం : మాలమహానాడు (పీవీ రావు వర్గం) రాయలసీమ అధ్యక్షుడు పెరుమాళ్ల నాగరాజు గురువారం రాజుపాళెంలో విలేకరులతో మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రభుదాసు, ఏసు రత్నం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : జాతీయ మాలమహానాడు అధ్యక్షుడు గోసా మనోహర్ గురువారం మాట్లాడారు. దేశంలో ఎక్కడైనా ఎస్సీల్లో ఒక కులం ఎక్కువ, ఒక కులం తక్కువ అని వివక్షకు గురైందా అని ప్రశ్నించారు. ఉప కులాలన్నీ అంటరానితనాన్ని సమానంగా అనుభవించాయన్నారు.

డిస్కం ఈఈగా రమణారెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు విద్యుత్ డివిజన్ ఈఈగా రమణారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. డివిజన్ పరిధిలోని ఏడీఈలు, ఏఈలుతోపాటు ఉద్యోగ సంఘాల నాయకులు ఈఈని కలిశారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఈ శ్రీనివాసులు రెడ్డిని నంద్యాలకు బదిలీ చేశారు.

కుష్టువ్యాధిపై అవగాహన తప్పనిసరి

అట్లూరు : కుష్టువ్యాధిపై అపోహలు మాని అవగాహన పెంచుకోవాలని స్థానిక వైద్యాధికారి డాక్టర్ మాధురి, డీపీఎం లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం మండల పరిధిలో కుష్టువ్యాధిపై అనుమానిత లక్షణాలు ఉన్న వారిని పరీక్షించి వారికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే ఎవరైనా శరీరంపై రాగిరంగు కలిగి స్పర్శలేకుండా చెమట పట్టని పొడలు ఉంటే కుష్టువ్యాధి కింద పరిగణించవచ్చని, ఆసుపత్రికి వచ్చి వైద్యులచే పరీక్షించుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మురళీకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

ముర్రుపాలు అమృతంతో సమానం


ప్రొద్దుటూరు క్రైం : చౌడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు


పోరుమామిళ్ల : మానవ హారం నిర్మించిన అంగన్‌వాడీ సిబ్బంది


చాపాడులో తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

ప్రొద్దుటూరు క్రైం : బిడ్డ పుట్టిన 1 గంటలోపు తల్లి ముర్రుపాలను తప్పకుండా తాపించాలని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ బాబు తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లా ఆస్పత్రిలో గురువారం తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయన్నారు. ముర్రుపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

శంకర్‌రావువీధి అంగన్‌వాడి కేంద్రంలో అవగాహన ర్యాలీ, సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తల్లి పాలకు ఎలాంటి ప్రత్యామ్నాయం లేదని, ప్రతి బిడ్డకు తల్లిపాలు అందేలా చేయడమే మన సంకల్పమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హిమబిందు, ఝాన్సీ, సామిని, సామితి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాణమ్మ పాల్గొన్నారు.

కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో

కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి హనీఫ్‌బాబా ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా చౌడూరు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్ర, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, సీహెచ్‌ఓ గౌతమి, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీబీరోడ్డు పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో..

టీబీ రోడ్డు పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న రజకవాడ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. డాక్టర్ నల్లబల్లె హిమబిందు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం

బద్వేలు అర్బన్ : తల్లిపాలు చిన్నారులకు ప్రకృతి ఇచ్చిన అపురూపమైన వరమని, ఈ పాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.శ్రీదేవి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం ఐసీడీఎస్ కార్యాలయంలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

అట్లూరులో..

అట్లూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో స్థానిక వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలతో స్థానిక వైద్యాధికారులు డాక్టర్ హమీదాబేగం, డాక్టర్ మాధురిలు ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మురళీకృష్ణ, డీసీఎంఓ లక్ష్మీనారాయణ, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : పోరుమామిళ్ళ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీఓ లక్ష్మీదేవి మాట్లాడుతూ వారం రోజుల పాటు తల్లిపాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగామన కల్పించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. పోరుమామిళ్ల, కాశినాయన, కలసపాడు మండలాల అంగన్‌వాడీ వర్కర్లు, సెక్టార్ సూపర్‌వైజర్లు, మెడికల్ ఆఫీసర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు వరం

ఖాజీపేట : తల్లి పాలు బిడ్డకు ఓ వరమని, తల్లి ముర్రుపాలను మించిన పౌష్టికాహారం లేనే లేదని, వాటిలో ఉండే పోషక విలువలతో శిశువులకు సంపూర్ణఆరోగ్యం చేకూరుతుందని ఖాజీపేట వైద్యాధికారి డాక్టర్ ముబిన్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పుల్లూరు, పత్తూరు గ్రామ సచివాలయాల పరిధిలో అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గర్భిణులకు ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు తొలి టీకా వంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సూపర్‌వైజర్ శోభన్‌బాబు, ఆశా అధికారి అరుణకుమారి, ఎంఎల్ హెచ్‌పీ ఇందర, సిబ్బంది పాల్గొన్నారు.

ముర్రుపాలు శ్రేయస్కరం

చాపాడు : పుట్టిన బిడ్డకు గంట లోపే ముర్రు పాలు తాపించటం శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం తల్లి పాల వారోత్సవాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాపించటం వలన పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. 6 నెలలు నిండిన చిన్నారులకు తల్లి పాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలలో అనుబంధమైన పోషకాహారాన్ని అందించాలని సూచించారు. అనంతరంలో చాపాడులో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుబ్బరత్నమ్మ, రాజ్యలక్ష్మీ, శారదమ్మ ప్రత్యూష, వరలక్ష్మీ, సౌజన్య, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

తల్లి పాల విశిష్టతను తెలియజేయాలి

తల్లి పాల విశిష్టతను గూర్చి ప్రతి తల్లికి తెలియజేయాలని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా.ఓబులేసు అన్నారు. మండలంలోని వెదురూరు గ్రామంలో గురువారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఆరు నెలల వరకూ తప్పనిసరిగా తాగించాలన్నారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు.

పింఛన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే


పింఛన్ డబ్బు అందిస్తున్న ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి గురువారం ఉదయం పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మోష, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ నాయకులు బచ్చల వీరప్రతాప్, గాలిపోతుల సుదర్శన్, రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి పింఛన్లు అందించారు.

పింఛన్లు పంపిణీ

రాజుపాళెం : మండలంలో వివిధ రకాల పింఛన్లు 4721 ఉన్నట్లు మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్ ఆలీఖాన్ తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేశారు. అందులో 4598 పంపిణీ చేయగా 123 మిగిలాయన్నారు. 123లో 19 మంది మృతిచెందారని, మిగిలినవారు గ్రామాల్లో లేరని చెప్పారు.

ఆస్పత్రి వెళ్లి గర్భిణికి పింఛన్ అందించిన సచివాలయ సిబ్బంది

చాపాడు : మండల పరిధిలోని అన్నవరం గ్రామానికి చెందిన మాడిశెట్టి అనూష దివ్యాంగురాలు. ఆమె ప్రొద్దుటూరులో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రసవించి చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో దివ్యాంగుల పింఛన్‌ను గ్రామ సచివాలయ సిబ్బందితో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి అనూషకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చాపాడు కాలువకు నీరు విడుదల


రాజోలి గ్రామం వద్ద కేసీ చాపాడు కాలువకు నీటిని విడుదల చేస్తున్న ఏఈ జాన్సన్, సిబ్బంది

రాజుపాళెం : ఖరీఫ్ సీజన్‌లో రైతులు నీటితో ఇబ్బంది లేకుండా పంటలు సాగు చేసుకోవచ్చునని కేసీ కెనాల్ ఏఈ జాన్సన్ తెలిపారు. రాజోలి గ్రామం వద్ద ఉన్న స్లూయిస్‌కు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఏఈతో పాటు వర్క్‌ఇన్‌స్పెక్టర్లు గేట్లు తిప్పి నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ ఈ కాలువకు ప్రస్తుతం 70 క్యూసెక్కులు నీరు వదిలామని, సాయంత్రానికి నీటిని పెంచుతామన్నారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతుల కోసం నీటిని వదిలినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నిండుకుండలా ఉండటంతో దిగువకు కృష్ణా జలాలు వచ్చాయని తెలిపారు. రాజోలి గ్రామం వద్ద నుంచి రాజుపాళెం, ప్రొద్దుటూరు, చాపాడు మండలాల్లోని రైతులు ఈ నీటిని ఉపయోగించుకుంటారన్నారు. మొత్తం 40 కిలోమీటర్ల మేర ఉన్న ఈ కాలువ కింద 18,472 ఎకరాలు ఆయకట్టు ఉందని, ఈ కాలువ కింద 6 ఉప కాలువలు ఉన్నాయన్నారు. అలాగే నాగాయపల్లె, చెన్నమరాజుపల్లె, మడూరు, పల్లోలి, నాగులపల్లె గ్రామాల్లో చెరువులున్నాయన్నారు.

ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ కృష్ణ ప్రసాద్

చాపాడు : పాఠశాలలో చదువుకునే ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ప్రొద్దుటూరు డిప్యూటీ డీఈఓ కృష్ణ ప్రసాద్ సూచించారు. మండలంలోని అన్నవరం, గుంతచీపాడు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను గురువారం డిప్యూటీ డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అన్నవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. గుంతచీపాడు గ్రామంలో విద్యార్థులతో కలసి పాఠశాలలోని వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ తరగతిలోని ప్రతి విద్యార్థి శక్తి సామర్థ్యాలను గుర్తించాలన్నారు. వెనకబడిన విద్యార్థుల పట్ల చిన్న చూపు లేకుండా వారికి కూడా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఉమాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల కమిటీ ఎన్నికకు నోటీసులు


చాపాడు జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక నోటీసులను అంటిస్తున్న ఎంఈఓలు

చాపాడు : మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల వద్ద గురువారం పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు సంబంధించిన నోటీసులను సూచిక బోర్డులలో ఏర్పాటు చేశారు. మండల కేంద్రమైన చాపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికలకు సంబంధించిన వివరాలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ మాట్లాడుతూప్రభుత్వం పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. అన్ని పాఠశాలలలో ఓటరు లీస్టులను సూచిక బోర్డులో ఏర్పాటు చేశామని తెలిపారు. ఓటర్ లీస్టులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. 5న ఓటరు లిస్టు తుది జాబితా విడుదల చేస్తామన్నారు. 8న అన్ని పాఠశాలలో ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గౌస్ మొద్దీన్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి విద్యార్థుల అవస్థలు


కస్తూర్బాపాఠశాలలో విద్యార్థునుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్ఎఫ్ఐ, టీడీపీ నాయకులు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మద్దిరెడ్డిపల్లె యాదవ నగర్ వద్ద ఉన్న కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంట్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో తాగునీటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు ఎస్ఎఫ్ఐ నాయకుడు సునీల్ తెలిపారు. గురువారం టీడీపీ నాయకులు ఎస్సార్ శ్రీనివాసులరెడ్డిలతో కలిసి ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాల సిబ్బంది రిపేరు చేయించక పోవడంతో సమీపంలో ఉన్న బోరు వాటర్ విద్యార్థులు తాగాల్సి వస్తుందన్నారు. అనంతరం బాలికలకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బా నరసింహ, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు కలివెల రాజశేఖర్, అరవింద్, దేవా సుబ్బయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాల్మిక్ అధికారి కేజే రఘురామిరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు 'స్కూల్ ఐ స్క్రీనింగ్ ప్రోగ్రాం'లో భాగంగా గురువారం ఆప్తాల్మిక్ ఆఫీసర్ కేజే రఘురామిరెడ్డి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి ఏడాదికి ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. దృష్టిలోపం ఉన్న వారు కంటి అద్దాలు వాడుతూ చూపు కోల్పోకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఆప్తాల్మిక్ అధికారి కేజే రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి రోజు 200 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దృష్టిలోపం ఉన్న వారికి ప్రభుత్వం తరపు నుంచి కళ్ల జోళ్లు ఉచితంగా ఇస్తామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కూడా చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శివదర్శనానంద సరస్వతి మాతాజీ

ప్రొద్దుటూరు : శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు రోజు ఆధ్యాత్మిక ప్రవచనాలు కార్యక్రమం ఉంటుందని స్వామినీ శివదర్శనానంద సరస్వతి మాతాజీ తెలిపారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో గురువారం సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమాన్ని శివదర్శనానంద సరస్వతి మాతాజీ ప్రారంభించారు. ఈసందర్భంగా మాతాజీ మాట్లాడుతూ ప్రస్తుతం ఉరుకులు, పరుగుల జీవన విధానంలో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఆధ్యాత్మికంగా నవడం ద్వారా ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా జీవనం సాగించవచ్చన్నారు. యోగా, ధ్యానం చేయడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బిరెడ్డి, నారాయణరెడ్డి, మునిశేఖర్ రెడ్డి, సోమశేఖర్ రావు, రామగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని సి.కొత్తపల్లె పొలంలోని పలు సర్వే నెంబర్లలో గల ప్రభుత్వ భూమిని ఆన్‌లైన్ చేసిన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి.వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. సి.కొత్తపల్లె పొలంలోని సర్వే నెంబర్ 54/3, 54/4, 54/5, 54/6, 54/7 లలో ఉన్న ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకుని చదును చేస్తున్నా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం బద్వేలు రూరల్, బి.కోడూరు, అట్లూరు మండలాల కార్యదర్శులు రవిచంద్ర, రామ్మోహన్, రమణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు శుభపరిణామం


బద్వేలు : అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బద్వేలు అర్బన్ : ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు శుభపరిణామమని మాజీ ఎమ్మెల్యే పి.ఎం.కమలమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ 30 ఏళ్ళుగా చేపట్టిన సుదీర్ఘ ఉద్యమానికి ఫలితం దక్కిందన్నారు. అలాగే ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు దేవానందం, హెచ్.వెంకటసుబ్బయ్య, జె.గురయ్యలు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ గురువారం స్థానిక నెల్లూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ నాయకులు ఓబుళాపురం శోభన్‌కుమార్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు మాదిగల జీవితాల్లో వెలుగు నింపిందన్నారు. మాదిగలు భవిష్యత్ కార్యాచరణకు సిద్ధం కావాలని ఆయన పిలుపిచ్చారు.

దోమల నివారణకు మందు పిచికారి

పోరుమామిళ్ల : పట్టణంలోని బాలుర వసతి గృహాలు, బీసీ విద్యార్థుల కాలేజీ హాస్టల్‌లో గురువారం దోమల నివారణకు ఏసీఎం మందును పిచికారి చేశారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహారెడ్డి, వైద్య సిబ్బంది హాస్టల్లకు వెళ్లి విద్యార్థుల రూముల్లో పిచికారి చేయించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నిర్మల, హెల్త్ అసిస్టెంట్ స్వామి రంగయ్య, యంఎల్‌హెచ్‌పి ఐశ్వర్య, ఆశ రజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

బడిలో మోగిన ఎన్నికల గంట

- ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల
- 8న ఎన్నికలు


మండలంలోని ప్రభుత్వ పాఠశాల

కాశినాయన : ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల గంట మోగింది. 2022 జూలైలో గత ప్రభుత్వం పేరెంట్స్ కమిటీల పేరుతో రెండు సంవత్సరాల కాలపరిమితితో ఎన్నికలు నిర్వహించింది. 2024 జూలై నాటికి ఆయా కమిటీల పదవీకాలం ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. అందుకు షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. ఆగస్టు 1వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు మేనేజ్‌మెంట్ కమిటీల పునర్వ్యవస్థీకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు నోటీసుబోర్డులో ఎన్నికల నిర్వహణ కోసం ఓటరుజాబితాను ప్రదర్శించారు. ఆగస్టు 5వ తేదీ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటరుజాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఫిర్యాదులు ఏవైనా అందితే వాటిని పరిశీలిస్తున్నారు. 8వ తేదీ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుల పునర్వ్యవస్థీకరణ ఎన్నికలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1–30 గంటల నుండి కమిటీ సభ్యులచే చైర్మన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నిక జరుగుతుంది. 2 గంటలకు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్‌చైర్మన్‌లతో ప్రమాణస్వీకారం చేయిస్తారు. అనంతరం 3 నుండి 3–30 గంటల వరకు మొదటి పాఠశాల నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహిస్తారు.

కాశినాయన మండలంలో పాఠశాలల వివరాలు

మండలంలో 40 పాఠశాలలు ఉండగా అందులో రెండు ఆర్సీఎం పాఠశాలలు ఉన్నాయి. మిగిలిన 38 పాఠశాలల్లో ఉన్నత పాఠశాలలు 5, ప్రాథమికోన్నత పాఠశాలలు 6, ప్రాథమిక పాఠశాలలు 27 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

నిర్దేశిత షెడ్యూలు ప్రకారమే ఎన్నికలు

ఎస్ఎంసీ ఎన్నికలను ఉన్నతాధికారులు నిర్దేశించిన నిర్దేశిత షెడ్యూలు ప్రకారం నిర్వహించడం జరుగుతుంది. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అలసత్వం వహించకుండా సజావుగా సకాలంలో ఎన్నికలు నిర్వహించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎన్నికల నిర్వహణకు హెచ్ఎంలకు సహకరించాలి.

– నిర్మల, ఎంఈఓ, కాశినాయన మండలం